సాక్షి
అనకాపల్లి
మంగళవారం : 30 : జనవరి : 2024



గ్రామాలు ప్రగతి బాట

రూ.1.12 కోట్ల వ్యయంతో నిర్మించిన 1.93 కిలోమీటర్ల తారురోడ్డును డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు. 8లో



రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగంలో ఆదివారం సెక్షన్ రౌండ్ 80 ఎం.ఎం 2,434 టన్నుల రికార్డు ఉత్పత్తి జరిగింది.

బీచ్‌రోడ్డులో దేవరకొండ



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను రుషికొండ, భీమిలి కొబ్బరిచెట్ల పార్కువద్ద చిత్రీకరించారు.

న్యూస్‌రీల్

ఏప్రిల్‌లో కేంద్రీయ ప్రవేశాలు



కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: ఏప్రిల్ నెలాఖరులో కేంద్రీయ విద్యాలయంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని ఎంపీ బీవీ సత్యవతి చెప్పారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ఎలిమెంటరీ పాఠశాలలో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాలను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. వచ్చే నెలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. నూతన జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. అంతకు ముందు పాఠశాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, కోటేశ్వరరావు, హెచ్‌ఎం బలిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల ఇన్‌చార్జి ఎంపీపీగా రాజారామ్



రాజారామ్‌కు ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

మాడుగుల: వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్‌కు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు సోమవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో రాజారామ్‌కు ఆర్డర్ కాపీ అందజేశారు. మాడుగుల ఎంపీపీ రామధర్మజ వ్యక్తిగత కారణాలతో తన పదవికి ఇటీవల రాజీనామా చేసిన విదితమే. దీంతో ఆ పదవికి ఖాళీ ఏర్పడింది. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు ఆ బాధ్యతలు పూర్తిస్థాయిలో అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గోపాల్‌రావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, వీరవిల్లి కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి కొరుకొండ చెల్లంనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కాత వెంకటరమణ పాల్గొన్నారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-కిరండూల్ రైలుకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25 మార్చి 1, 2, 3, 8, 9, 10, 15, 16, 17, 22, 23, 24, 29, 30, 31వ తేదీల్లోను, కిరండూల్‌లో బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఫిబ్రవరి 3, 4, 5, 10, 11, 12, 17, 18, 19, 24, 25, 26, మార్చి 2, 3, 4, 9, 10, 11, 16, 17, 18, 23, 24, 25, 30, 31 ఏప్రిల్ 1వ తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ



ఉపకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లూచి

రావికమతం: కొత్తకోట పీహెచ్‌సి పరిధిలోని చీమలపాడు ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీ చేసింది. రికార్డులను పరిశీలించి, క్షేత్ర స్థాయిలో గర్భవతులు, బాలింతలు, కౌమార బాలికలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొంత మంది రికార్డులు సరిగా నిర్వహించకపోవడంతో వారికి తగిన సూచనలిచ్చారు. ఇకపై పొరపాట్లు రాకుండా చూడాలని, సేవలు, అటెండన్స్‌పై నిర్లక్ష్య ధోరణి చూపవద్దని సూచనలిచ్చారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యుడు డాక్టర్ లూచి, డీపీహెచ్‌ఎన్‌వో నాగమణి, స్థానిక వైద్యాధికారులు రజని, సురేఖ, విస్తరణాధికారి పి.రామారావు పాల్గొన్నారు.

టాయిలెట్స్ 2.0

- మహా నగరంలో అత్యాధునిక టాయిలెట్స్
- జోన్‌కు 3 చొప్పున 24 ఏర్పాటుకు జీవీఎంసీ ప్రణాళిక
- అందుబాటులో శానిటరీ ప్యాడ్స్, బేబీ ఫీడింగ్ రూమ్‌లు



బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్



అధునాతన వాష్‌బేసిన్స్



బేబీ ఫీడింగ్ రూమ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

నగర ప్రజలకు అడుగడుగునా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) కీలక అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణపై చేపట్టిన టాయిలెట్ 2.0లో దూకుడుగా వ్యవహరిస్తోంది. అత్యాధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తోంది. జోన్‌కు 3 చొప్పున గ్రేటర్ పరిధిలోని 8 జోన్లలో 24 టాయిలెట్స్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ప్రతి మరుగుదొడ్డిలోనూ శానిటరీ ప్యాడ్స్, బేబీ ఫీడింగ్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తుండటం విశేషం.

జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధతో..

భారత్‌లోని పట్టణాలు, నగరాల్లో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు ఏటా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ వహించింది. ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సామాజిక, ప్రజా మరుగుదొడ్లు పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉండేలా చూడాలంటూ టాయిలెట్ 2.0 ఛాలెంజ్‌ని నిర్వహిస్తోంది. ఈ ఛాలెంజ్‌ని స్వీకరించిన జీవీఎంసీ.. విశాఖ నగరంలో ప్రజా, సామాజిక మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు, నిర్వహణను మరింత మెరుగు పరచడంలో శ్రద్ధ వహించింది. అత్యాధునిక టాయిలెట్స్‌ని అందుబాటులోకి తీసుకొస్తోంది.

సౌకర్యాల మరుగుదొడ్లు : టాయిలెట్స్, పారిశుధ్యాన్ని నగరానికి గౌరవంగా.. బాధ్యతగా నిర్వహించేలా జీవీఎంసీ అత్యాధునిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది. పూర్తిగా అత్యాధునిక పద్ధతిలో మోడ్రన్‌గా టాయిలెట్స్ నిర్మిస్తోంది. ఇండియన్, వెస్ట్రన్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తోంది. అన్ని వర్గాల వారికీ అనుకూలంగా ఉండేలా టాయిలెట్స్ నిర్మిస్తోంది. ప్రతి ఒక్కరూ సులభంగా నడిచేలా మెట్లు, ర్యాంప్, హ్యాండ్ సపోర్ట్‌తోపాటు 24 గంటలూ నీటి సౌకర్యం కల్పిస్తోంది. ఫంక్షనల్ ఫ్లష్ సిస్టమ్, అద్దం, వాష్‌బేసిన్, హ్యాండ్ డ్రయర్ తదితర పూర్తి స్థాయి సౌకర్యాలతో టాయిలెట్స్ 2.0 ఏర్పాటవుతున్నాయి.



టాయిలెట్స్

మహిళలకు ప్రత్యేకంగా..

ఇక మహిళలకు అవసరమైన సౌకర్యాలు కూడా ఈ అధునాతన టాయిలెట్స్‌లో పొందుపరుస్తున్నారు. మహిళల కోసం ఏర్పాటవుతున్న పింక్ టాయిలెట్స్‌లో కాయిన్ వేస్తే వచ్చేలా శానిటరీ న్యాప్‌కిన్స్ మెషీన్లు ప్రతి టాయిలెట్‌లో అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా... న్యాప్‌కిన్స్‌ని ధ్వంసం చేసే మెషీన్ కూడా ఉంటుంది. బేబీ ఫీడింగ్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టాయిలెట్ బ్లాక్‌లో వెంటిలేటర్/ఎగ్జాస్ట్ ఫ్యాన్ అమర్చారు. థర్డ్ జెండర్ కోసం ప్రత్యేకంగా టాయిలెట్‌ని ఇందులో ఏర్పాటు చేయడం విశేషం.

పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తున్నాం



నగర ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలపైనా జీవీఎంసీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. టాయిలెట్ 2.0లో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా జోన్-1లో ఒకటి, జోన్-2, 4, 5లో 2, జోన్-3, 6,7 లో 3 చొప్పున, జోన్-8లో 4 టాయిలెట్స్ ఆధునికీకరిస్తున్నాం. టూరిస్ట్‌స్పాట్స్, రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాలు, బస్టాప్‌లు, హాస్పిటల్స్ తదితర ప్రాంతాల్లో టాయిలెట్స్ 2.0 సిద్ధం చేస్తున్నాం. ఇవి పూర్తయ్యాక మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తాం. ప్రత్యేకంగా మహిళల అవసరాలను తీర్చే విధంగా వీటిని రూపుదిద్దుతున్నాం.

– సీఎం సాయికాంత్ వర్మ, కమిషనర్, జీవీఎంసీ

నిరుద్యోగులకు కుచ్చుటోపీ

- ఇద్దరు ఉద్యోగులపై విశాఖ కలెక్టర్‌కు బాధిత యువకుల ఫిర్యాదు



విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేస్తున్న బాధిత యువకులు

చోడవరం: ఉద్యోగాల పేరుతో డబ్బులు దండుకుని మోసగించిన ఇద్దరు ఉద్యోగులపై విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు బాధిత యువకులు ఫిర్యాదు చేశారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని చోడవరానికి చెందిన బాధిత యువకులు బొబ్బిలి నాయుడు, కొట్టాన సూర్యప్రకాష్, సకలా వంశీ, బొమ్మిశెట్టి మదన్‌కుమార్, గోకాడ గణేష్, ప్రేమ్ సాయికుమార్, డోకల మోహన్ తెలిపారు. చోడవరానికి చెందిన అన్నదమ్ములు ఈ మోసానికి పాల్పడ్డారని వాపోయారు. ఒకరు సిటీ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గాను, మరొకరు నావల్ డాక్‌యార్డులో పనిచేస్తున్నారన్నారు. కానిస్టేబుళ్లుగా, డాక్‌యార్డ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు తీసుకుని రెండేళ్లుగా తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. పలుమార్లు అడిగినా వారు స్పందించలేదని, దాంతో మోసపోయినట్టు గ్రహించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తామంతా వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారమని, డిగ్రీలు చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వీరికి డబ్బులు కట్టామన్నారు. తమకు న్యాయం చేయాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలావుండగా వీరే కాకుండా మరి కొంతమందిని ఇదే తరహా మోసానికి సదరు ఉద్యోగులు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి.

నులిపురుగులను నులిమేద్దాం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, డీఆర్వో, డీఎంహెచ్‌వో

- గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు ప్రతి వైద్యాధికారి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. «ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం» గోడపత్రికను సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ వచ్చే నెల 9న డి వార్మింగ్ డే సందర్భంగా 16వ తేదీ వరకు ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో హేమంత్ మాట్లాడుతూ నులిపురుగుల సంక్రమణ ఎక్కువగా ఉన్న పిల్లలకు మాత్ర వేసుకున్న తర్వాత వికారం, కొద్దిగా కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వంటి లక్షణాలు కలిగే అవకాశముందన్నారు. అటువంటి లక్షణాలు కొద్ది క్షణాల్లో తగ్గిపోతాయన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ చర్యలు...

ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే నెల 11 నుంచి 20వ తేదీ వరకు సాధారణ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్ పరీక్షలు, మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షల నిర్వహణ నిమిత్తం ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులను ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు సరఫరా చేయాలని జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులకు సూచించారు. కళాశాలల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఆర్ఐవో బి.సుజాత మాట్లాడారు.

వేటూరికి సాటి లేరు

- సినీ రచయిత, దర్శకుడు భారవి
- తునిలో వైభవంగా వేటూరి జన్మదిన వేడుకలు
- భారవికి వేటూరి కవితా పురస్కారం ప్రదానం



తునిలో జరిగిన వేటూరి జయంతి వేడుకల్లో భారవిని పుస్తకాలతో సత్కరిస్తున్న దృశ్యం


పాయకరావుపేట/తుని: దివంగత సినీ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి సహజత్వానికి నిలువెత్తు నిదర్శనమని తెలుగు సినీ, పాటల రచయిత, దర్శకుడు జేకే భారవి కొనియాడారు. కలలు చెదిరినా, కలత చెందినా, ఎలాంటి భావాన్నయినా పలికించే శక్తి, యుక్తి ఆయనకే సొంతమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో ఆడుకోవడం వేటూరికి సర్వసాధారణమని అన్నారు. తుని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన వేటూరి 89వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ మాట్లాడుతూ, వేటూరికి తుని, పాయకరావుపేట పట్టణాల్లో ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకొని సాహితీ పీఠం ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకూ తెలుగు సినీ రంగంలో రచనలో నిష్ణాతులైన 12 మందికి వేటూరి అవార్డును అందజేశామని, 13వ అవార్డు భారవికి ప్రదానం చేయడం ఆనందంగా ఉందని శర్మ అన్నారు. వేద పండితులు, మేళతాళాలతో భారవికి వేటూరి పురస్కారాన్ని అందజేశారు. అవార్డు గ్రహీత భారవి మాట్లాడుతూ వేటూరి సాహిత్యం సహజత్వానికి దగ్గర ఉంటుందని, ఇది మరెవరికీ సాధ్యం కాలేదన్నారు. వేటూరితో ఉన్న పరిచయం తక్కువైనా ఎక్కువ నేర్చుకున్నానని, అటువంటి మహోన్నత కవి పురస్కారం అందుకోవడం జీవితంలో మరువలేనని ఆనంద బాష్పాలతో అన్నారు. సరస్వతిని కొలిస్తే వచ్చే జ్ఞానం మనల్ని కాపాడటమే కాదు భూమిని రక్షిస్తుందన్నారు. ఆది శంకరాచార్య, అన్నమయ్య, శ్రీరామదాసు, మంజునాథ సినిమాలు తనకు ఎంతో గుర్తింపునిచ్చాయన్నారు. ఎక్కడో పుట్టిన కవికి తునిలో వేడుకలు జరపుతున్నారంటే సాహిత్యానికి తుని ప్రజలు ఇస్తున్న గౌరవాన్ని యువత అందిపుచ్చుకోవాలన్నారు. తొలుత వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో టాపర్లుగా నిలవాలి : ఆర్జేడీ జ్యోతికుమారి

మాడుగుల: రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ విద్యార్థులు టాపర్లుగా నిలవాలని ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీకి వచ్చిన ఆమె ప్రధానమంత్రి పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. పరీక్షలపై ఆందోళన చెందనవసరం లేదని చెప్పి, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసే విధానంపై విద్యార్థులకు సలహాలు అందజేశారు. అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎస్‌వో విజయ పాల్గొన్నారు.

డీఐజీగా విశాల్ గున్ని

- నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ బదిలీ



విశాల్ గున్ని

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని నియమితులయ్యారు. ప్రస్తుత విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాను విజయనగరం ఏపీఎస్పీ 5వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు. ఈమేరకు సోమవారం చీఫ్ సెక్రెటరీ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పాత టారిఫ్‌లే..

- వరుసగా రెండో ఏడాది విద్యుత్ చార్జీల పెంపు లేనట్లే..
- ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదనలు వెల్లడించిన ఈపీడీసీఎల్
- 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ పాత టారిఫ్‌లే అమలు
- విద్యుత్ అమ్మకాలూ గణనీయంగా వృద్ధి
- రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం
- ఐదేళ్ల కాలంలో 116 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం



ప్రతిపాదనలు వెల్లడిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ప్రతిపక్షాల విమర్శల నోటికి తాళం పడింది. విద్యుత్ చార్జీలు పెంచేస్తున్నారంటూ గగ్గోలు పెట్టి ప్రజల్లో ఆందోళనలు సృష్టించిన పచ్చ మీడియా రాతలకు అర్థం లేకుండా పోయింది. గతేడాది టారిఫ్‌లే 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ అమల్లో ఉంటాయనీ.. వినియోగదారులపై ఎలాంటి చార్జీల భారం మోపడం లేదని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) స్పష్టం చేసింది. నగరంలో నిర్వహించిన ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి వివరాలు వెల్లడించారు. విద్యుత్ అమ్మకాలు గణనీయంగా వృద్ధి చెందడం, రెవెన్యూ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం సమకూరడంతో వినియోగదారులపై భారం మోపకూడదని నిర్ణయించుకున్నట్లు తమ ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈపీడీసీఎల్ పరిధిలో నెట్‌వర్క్ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఏటా ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రావడం ఆనవాయితీ. పేదలు మినహా అన్ని వర్గాల వినియోగదారులపై ఎంతో కొంత పెంపు సాధారణంగా ఉంటుంది. అయితే.. 2023-24లో అనూహ్యంగా ఇంటెన్సివ్ పరిశ్రమలు(ఫెర్రో అల్లాయిస్) మినహా.. ఏ ఒక్క కేటగిరీలోనూ చార్జీలు పెంచాలని డిస్కమ్ ప్రతిపాదించలేదు. ఈసారి కూడా అదే పంథా కొనసాగిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ ఎలాంటి భారం మోపే ఆలోచన లేదంటూ ఏపీఈపీడీసీఎల్ స్పష్టం చేసింది. దీంతో విద్యుత్ వినియోగదారులపై వరుసగా రెండో ఏడాది చార్జీల భారం ఉండదని స్పష్టమైంది. ఈసారి కూడా ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు, గ్రీన్ పవర్, రైల్వేలకు సరఫరా చేసే విద్యుత్‌పై మాత్రమే స్వల్ప భారం మోపనున్నట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఏపీఈఆర్‌సీకి అందించిన ప్రతిపాదనల్లో స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయం ఏ ఇతర కేటగిరీల్లోనూ పైసా భారం కూడా మోపకపోవడం విశేషం. 2023-24లోనూ ఏ ఒక్క కేటగిరీపైనా భారం మోపలేదు.

'బాబు' బకాయిల పాపాల్ని మోస్తూ...

చంద్రబాబు హయాంలో బకాయిలు చెల్లించకపోవడంతో ఈపీడీసీఎల్‌తో పాటు ఇతర డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి. వాటి నుంచి గట్టెక్కించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి రెండేళ్లు స్వల్పంగా చార్జీలు పెంచాల్సిన పరిస్థితి దాపురించింది. గత టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 వరకూ ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.11 వేల కోట్ల వరకూ చెల్లించాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.1,711.22 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులిపేసుకుంది. వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం నాలుగేళ్ల కాలంలో ఇప్పటివరకు రూ.9,341.60 కోట్లు చెల్లింపులు చేసింది. అదే విధంగా విద్యుత్ అమ్మకాల్లోనూ క్రమంగా పుంజుకుంది. 2014-15 నాటికి 13,518 మిలియన్ యూనిట్లు విద్యుత్ విక్రయాలు జరగ్గా.. 2023-24 నాటికి రెండు రెట్లకు పైగా పెరిగి ఏకంగా 27,864 మి.యూనిట్లకు చేరుకుంది. పంపిణీ నష్టాల్ని కూడా క్రమంగా తగ్గించుకుంది. 2014-15 నాటికి 8.45 శాతంగా ఉన్న పంపిణీ నష్టం ప్రస్తుతం 5.98 శాతానికి తగ్గింది. వాణిజ్య పరమైన నష్టాల్లోనూ ఈపీడీసీఎల్ కోలుకుంది. చంద్రబాబు గద్దె దిగే నాటికి 18.31 శాతం ఉండగా.. ప్రస్తుతం కేవలం 9.16 శాతానికి మాత్రమే పరిమితమైంది.

నెట్‌వర్క్ అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈపీడీసీఎల్ పరిధిలో నాలుగేళ్ల కాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఏకంగా 116 సబ్‌స్టేషన్లను 33/11 కేవీ సామర్థ్యంతో నిర్మించారు. భవిష్యత్తులో నెట్‌వర్క్ అభివృద్ధికి సుదీర్ఘ ప్రణాళికలు రూపొందించామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, సీజీఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, ఒ.సింహాద్రి, అచ్చి రవికుమార్, బి.రామచంద్రప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర, ఎస్.హరిబాబు, ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షేర్ మార్కెట్ పేరుతో రూ.కోటికి కుచ్చు టోపీ?

యలమంచిలి రూరల్: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి పట్టణానికి చెందిన ఓ వ్యాపారిని మోసం చేసి రూ.కోటి వరకు కుచ్చుటోపీ పెట్టిన భారీ మోసం యలమంచిలిలో వెలుగు చూసింది. సైతారుపేటకు చెందిన ఒక వ్యక్తి స్క్రాప్ దుకాణం నిర్వహిస్తూ స్థిరాస్తి వ్యాపారం చేస్తుంటారు. అచ్యుతాపురానికి చెందిన ఓ యువకుడు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే కొన్ని గంటల్లోనే నాలుగైదురెట్లు లాభాలు వస్తాయని ఆశ చూపాడు. ఉదయం లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే కొన్ని గంటల్లోనే నాలుగు లక్షల లాభం వచ్చినట్టు మొబైల్ ఫోన్ ద్వారా నకిలీ స్క్రీన్ షాట్లు చూపించడంతో అతడి మాటలు నమ్మిన వ్యాపారి పలు దఫాలుగా ఆ యువకుడి బ్యాంకు ఖాతాకు కోటి రూపాయలకు పైగా నగదు బదిలీ చేశారు. ఆ తర్వాత యువకుడు ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, తప్పించుకు తిరగడంతో బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది. ఇటీవల ఈజీ మనీకి ఆకర్షితులైన అమాయకులను కేటుగాళ్లు మోసం చేస్తున్న పలు ఘటనల తరహాలోనే ఈ మోసం జరగడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్

- జెడ్పీసీఈవో పోలినాయుడు



నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు తదితరులు

మాడుగుల : చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిత ఉంటుందని, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలకు సోమవారం ఏర్పాటు చేసిన బహుమతులు ప్రదానం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయిలో తలపడనున్నారన్నారు. నియోజకవర్గంలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ టోర్నమెంట్లలో విజయం సాధించిన 30 జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో మీనాకుమారి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు సీజ్..



పట్టుబడిన ఇసుక ట్రాక్టరు

కోటవురట్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం రాజుపేట శివారు రామన్నపాలెం వద్ద ట్రాక్టర్‌లో తరలిపోతున్న ఇసుకను సోమవారం పట్టుకున్నారు. ఇసుక తరలింపుకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టరును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రూ.10 వేలు అపరాధ రుసుము విధించారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- కలెక్టరేట్‌లో స్పందనకు 494 దరఖాస్తులు
- ఎస్పీకి వృద్ధురాలి ఫిర్యాదు



కలెక్టరేట్‌లో అర్జీదారుని దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన నర్సమ్మ సమస్యను ఆమె వద్దకే వచ్చి వింటున్న ఎస్పీ

తుమ్మపాల : అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు మరింత వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) జరిగింది. 494 మంది నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరస్కరించిన అర్జీలకు తిరస్కరణకు గల కారణాలను అర్జీదారులకు తెలియాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, ఎస్‌డీసీ ఎ.మహేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బంధువులు అన్యాయం చేశారు..

అనకాపల్లి : మూడేళ్ల క్రితం తన మేనల్లుడి కుమారుడు రవి వ్యాపారం నిమిత్తం ఐదు తులాల బంగారం ఇచ్చానని, వారు తనకు అన్యాయం చేశారని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన నర్సమ్మ సోమవారం స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఏడాదిన్నర క్రితం పక్షవాతం రావడంతో ఆరోగ్య రీత్యా ఐదుతులాల బంగారం గాని, నగదు గానీ ఇవ్వమని కోరినప్పటికీ వారు ఇవ్వలేదని, ఈ విషయంపై నర్సమ్మ ముత్యాలమ్మపాలెంలో పెద్దల సమక్షంలో రవి తీసుకున్న బంగారానికి నగదు ఇమ్మని కోరినా ఫలితం లేకపోయిందని తెలిపారు. దీనిపై వారం రోజుల క్రితం పరవాడ పోలీస్‌స్టేషన్‌లో నర్సమ్మ ఫిర్యాదు చేసింది. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో స్పందన ద్వారా ఎస్పీకి తన సమస్యను వెల్లబోసుకుంది.

ఎస్పీ కార్యాలయానికి 46 అర్జీలు..

చట్టపరిధిలో సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన 46 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎస్‌ల పరిధిలో అర్జీలదారుల పట్ల తమ అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణ రావు, ఎస్‌ఐలు పి.దివ్య, కె.సావిత్రి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పల్లె గ్రామాలు ప్రగతి బాట



చిననందిపల్లి-చేనులపాలెం తారురోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- ప్రతి గ్రామానికి తారురోడ్ల నిర్మాణం ఘనత వైఎస్సార్‌సీపీదే
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మునుపెన్నడూ లేని విధంగా పల్లె గ్రామాలన్నీ ప్రగతి బాట పట్టాయని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. చిననందిపల్లి నుండి చేనులపాలెం వరకు రూ.1.12 కోట్ల వ్యయంతో 1.93 కిలోమీటర్ల మేర నిర్మించిన తారురోడ్డును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, తారురోడ్డును ప్రారంభించారు. గ్రామస్తులతో కలిసి నూతనంగా నిర్మించిన రోడ్డు మీదుగా కొద్ది దూరం నడిచారు. గ్రామానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం బూడికి గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో గ్రామాల మధ్య తారురోడ్లు నిర్మించామన్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు దశాబ్దాల రోడ్ల కష్టాలను తీర్చగలిగామన్నారు. ప్రజల ఆనందోత్సవాల నడుమ ప్రారంభోత్సవం చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, స్థానిక ఉప సర్పంచ్ రొంగలి కన్నంనాయుడు, బొడ్డు నారాయణమూర్తి, కామిరెడ్డి సన్యాసయ్య, రొంగలి బంగారయ్య, రొంగలి పైడితల్లి పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు

- నియోజకవర్గంలో 104 దేవాలయాలకు రూ.10.4 కోట్లు మంజూరు
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజారావు

చోడవరం : దేవాలయాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరంలో ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న దేవదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయాలన్నీ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో 150 దేవాలయాల అభివృద్ధికి నిధుల మంజూరు కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి ప్రతిపాదనలు పంపామని ధర్మశ్రీ చెప్పారు. 119 పంచాయతీల్లో 150 దేవాలయాలకు ప్రతిపాదన పంపగా 104 ఆలయాల అభివృద్ధికి ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు చొప్పున రూ.10.4 కోట్లు నిధులు మంజూరుకు అనుమతి వచ్చిందన్నారు. టీటీడీ చైర్మన్‌గా వై.వి.సుబ్బారెడ్డి వచ్చాక ఎటువంటి కంట్రిబ్యూషన్ లేకుండానే ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం మొదలైందని, నేటికీ అదేవిధంగా కొనసాగుతుందని చెప్పారు. చోడవరం మండలానికి 36, బుచ్చెయ్యపేట మండలానికి 39, రావికమతం 25, రోలుగుంట మండలానికి 50 దేవాలయాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. రోలుగుంట మండలంలో గిరిజన తండాలు ఎక్కువగా ఉండడంతో వాటికి కూడా మంజూరయ్యాయన్నారు.

ఇప్పటికే 15 దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదలయ్యాయని ధర్మశ్రీ చెప్పారు. సమావేశంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏసీ రాజారావు, చోడవరం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.వి.సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సీనియర్ నాయకులు వెంపలి ఆనందీశ్వరరావు, బొడ్డేడ సూర్యనారాయణ, పంచాయతీ ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పనికొచ్చే పనిచేద్దాం..



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

- 1978-80 బ్యాచ్ టెన్త్, ఇంటర్ పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శాశ్వత కార్యక్రమాన్ని చేపడదామని 1978-80 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. డిగ్రీ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు తాము 2011లో తిరిగి కలుసుకున్న మీదట పూర్వ విద్యార్థుల సంఘంగా ఏర్పడి చేసిన పలు సేవా కార్యక్రమాలు గురించి సంఘ బాధ్యులు మండల గౌరీశంకర్ వివరించారు. తాము చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, పూర్వపు ఇంటర్మీడియట్ కళాశాల భవనాలను పరిశీలించి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. డిగ్రీ కళాశాల అల్యూమ్నీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఇదే విద్యార్థి సంఘం సభ్యులు ఉండడంతో కళాశాలకు నాక్ గుర్తింపు రావడంలో తమ వంతు చేసిన కృషిని వివరించారు. కరోనా సమయంలో పాదచారులకు ఆహార కిరాణా సరుకులు పంపిణీ చేసినట్టు చెప్పారు. డిగ్రీ కళాశాలలో శాశ్వత పని నిమిత్తం పూర్వ విద్యార్థులు సీనియర్ ఆడిట్ ఆఫీసర్ కోటిపల్లి కృష్ణాజీ, శ్రీకాకుళం పోలీస్ సూపరింటెండెంట్ వింజమూరి సత్యనారాయణమూర్తి, పాడేరు ఐటీడీఏ గృహనిర్మాణశాఖ ఇంజినీర్ తమ వంతు ఆర్థిక సహాయాన్ని వేదిక నుంచే ప్రకటించారు. ఒక మంచి పని చేయడానికి కలుసుకున్న మనం మళ్లీ మళ్లీ కలుసుకుందాం, మరిన్ని మంచి పనులు చేద్దాం అంటూ ఆనందంగా వీడ్కోలు పలికారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం..ఆంధ్రా

- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మహిళల జట్టుకు బహుమతులు అందజేస్తున్న ధర్మశ్రీ



పురుషుల జట్టుకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : ఆడుదాం..ఆంధ్ర ఆటల పోటీల ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించాలన్న ఆశయంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం నియోజకవర్గస్థాయి ఆడుదాం..ఆంధ్ర ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. పురుషులు, మహిళ విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్ పోటీలు నియోజవర్గ స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన పురుషుల జట్లకు మొదటి బహుమతి రూ. 35వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.5వేలు, మహిళల విభాగంలో మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ. 5వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

వీటితోపాటు విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్లు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా క్రీడలకు ఇంత స్థాయిలో ప్రోత్సాహం అందివ్వలేదన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు క్రీడా పరికరాలు కూడా అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ధర్మశ్రీ అన్నారు. రాష్ట్ర క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లాలన్నదే ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఈఓపీఆర్‌డి చైతన్య, రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమి డైరక్టర్ జొన్నాడ శ్రీనువాసరావు, సర్పంచ్ గాడి అప్పారావు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల ఆదాయం రూ.4.86 కోట్లు



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల ఆదాయం రూ.4 కోట్ల 86 లక్షల 46 వేల 924 లభించింది. గతేడాది డిసెంబర్ 13 నుంచి ఈ నెల 11వరకు మార్గశిర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నెల రోజుల పాటు సాగిన ఉత్సవాల్లో అమ్మవారి దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయం, కేశఖండన, వివిధ సేవలు, పూజలు, విరాళాలు, హుండీల ద్వారా రూ.4,86,46,924 వచ్చింది. గతేడాది మార్గశిర మాసోత్సవాల్లో 4,54,36,024 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అదనంగా రూ.32 లక్షల 10 వేల 900 లభించింది. ఉత్సవాలకు సహకరించిన పోలీస్, జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, పబ్లిక్ హెల్త్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఫైర్, ఇతర శాఖలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే నెల 1 నుంచి వైజాగ్ ఫార్మా ఎక్స్‌పో

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఎఎస్ఆర్ఎం) కార్యదర్శి, సియాంక, ఔషధ పరిశ్రమ ఎండీ జెట్టి సుబ్బారావు చెప్పారు. జేఎన్‌పీసీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమలతో పాటు జిల్లాలోని వివిధ ఔషధ పరిశ్రమల యాజమాన్యాలు కూడా పాల్గొంటాయన్నారు. ఔషధ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచుతారన్నారు. యాజమాన్యాలు తమ ఆర్డర్లను బుక్ చేసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంఎఎస్ఆర్ఎం అధ్యక్షుడు, వెర్దంతి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఎండీ ఎం.శివరాంప్రసాద్, ఎగ్జిబిషన్ డైరెక్టర్ అజిత్ కుమార్ శుక్లా పాల్గొన్నారు.

నెలలు నిండని శిశువుకు ఓపెన్ హార్ట్ సర్జరీ

- కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుల ఘనత



శిశువు తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుల బృందం

అక్కిరెడ్డిపాలెం: విశాఖ నగర చరిత్రలోనే తొలిసారిగా కేవలం 1.3 కిలోల బరువున్న ఓ చిన్నారికి అత్యంత సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్స (ఓపెన్ హార్ట్ సర్జరీ)ని విజయవంతం చేశారు. సోమవారం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ పి.సతీష్ తెలిపిన వివరాలు... నగరంలోని ఒక ప్రైవేట్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అక్కయ్యపాలెంకు చెందిన గణేష్ కుమార్, రేవతిలకు ఈ నెల 2వ తేదీన కవల పిల్లలు పుట్టారు. బాబు ఆరోగ్యంగానే ఉన్నా పాపకు ఊపిరి అందక ఇబ్బంది పడింది. పాపను లోటస్ పిల్లల ఆస్పత్రిలో చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ గణేష్ నేతృత్వంలో నియోనాటాలజిస్ట్ యూనిట్లో చేర్చి సంరక్షించారు. అప్పటికి పాప బరువు 1.2 కిలోలు. అనంతరం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి చెందిన కడల్స్ విభాగంలోని పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శాంతి ప్రియ శిశువును పరీక్షించారు. శిశువుకు పుట్టుకతోనే గుండె సమస్య ఉందని నిర్ధారించారు. ఈ సమయంలో ఊపిరితిత్తుల నుంచి శుద్ధి చేసిన రక్తాన్ని గుండెకు తీసుకువెళ్లాల్సిన రక్తనాళాలు అసాధారణంగా గుండె దిగువున కాలేయంలోకి వెళ్లిపోతున్నాయన్నారు. పాప కు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కడల్స్ యూనిట్‌లో డాక్టర్ అనిల్ కుమార్ ధర్మపురం నేతృత్వంలో నిపుణుల బృందం 8 గంటల పాటు శ్రమించి ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించింది. కాలేయానికి వెళ్తున్న రక్తనాళాలన్నీ జాగ్రత్తగా తీసి వాటిని తిరిగి సాధారణ పద్ధతిలో గుండెలోని ఎడమవైపునకు మార్చారు. పిడియాట్రిక్ కార్డియాక్ ఎనస్తిషియాలజిస్ట్ డాక్టర్ ఆర్.నాగరాజన్ సహకారం తీసుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం నియోనాటల్ ఐసీయూలో డాక్టర్ నిఖిల్ తెన్నేటి నేతృత్వంలో నియోనాటల్ బృందం పాపను కంటికి రెప్పలా కాపాడిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ బరువుతో నెలలు నిండకు ముందే పుట్టిన పిల్లలకు సంక్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు చేసేటప్పుడు మరణాల రేటు చాలా ఎక్కువగా ఉంటుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఇలా శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన అతితక్కువ కేసుల్లో ఇదొకటన్నారు. ఆపరేషన్‌కు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కానీ పాప తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని 50 శాతం ఖర్చులు కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి భరించిందని, మిగిలిన 50 శాతం పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయానికి హామీ ఇచ్చినట్టు వైద్యులు తెలిపారు. ఇలాంటి శస్త్ర చికిత్సలకు ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలను ఆశ్రయిస్తుంటాం.. మొదటిసారి తెలుగు రాష్ట్రాల్లోనే విశాఖలోని కిమ్స్ ఐకాన్‌లో విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పాప పూర్తిగా కోలుకుంది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సాయి బలరామ కృష్ణ, గోపాల రాజు, రమేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల సృజనాత్మకతకు వేదిక ఆర్ఏఆర్ఎస్ ఇంక్యుబేషన్ సెంటర్




ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి: రైతుల సృజనాత్మక ఆలోచనలు ఆచరణలో పెట్టేందుకు ఇంక్యుబేషన్ సెంటర్ దోహదపడుతుందని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో రూ.3.5 కోట్లతో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్ పనులను ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావుతో కలిసి ఆమె పరిశీలించారు. బెల్లం, చిరుధాన్యాలు, పనస వంటివి ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కోసం రైతులకు ఈ కేంద్రం ద్వారా అందజేయన్నట్టు చెప్పారు. మరో 10 రోజుల్లో ఈ సెంటర్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతోపాటు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీ సత్యవతికి ఏడీఆర్ జగన్నాథరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, ఎస్‌వీడీఎస్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకుడు కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్లు జైలు

విశాఖ లీగల్ : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని సోమ వారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివి. నిందితుడు దిమిలి సతీష్ (27) పాత గాజువాక దగ్గర అశోక్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బాధిత బాలిక అదే ఇంటి కింద భాగంలో నివాసం ఉంటున్నారు. బాలిక శ్రీహరిపురంలోని ఒక పాఠశాలలో చదువుకుంటుంది. 2020 నవంబరు 20వ తేదీన మధ్యాహ్నం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండడంతో ఇదే అదునుగా సతీష్ బాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దృశ్యాలను మరో బాలుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి బాలిక పెద్దమ్మకు చూపించాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితునికి శిక్ష విధించారు. బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

నేటి నుంచి జీవీఎంసీ ఉద్యోగులకు క్యాన్సర్ పరీక్షలు



సమవేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: వచ్చే నెల 4వ తేదీన అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు డాక్టర్ హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్టు అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఏఎంఓహెచ్‌లు పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ క్లోజ్ ది కేర్ గ్యాప్ థీమ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 4వరకు జీవీఎంసీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కైలాసపురం జూబ్లీ పోర్టు ఆస్పత్రి ఆవరణలో ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు ఈ స్క్రీనింగ్ టెస్టులు ఉంటాయన్నారు. మంగళవారం జోన్ 5, 8 పరిధిలోని జోనల్ సిబ్బందికి, బుధవారం జోన్-6 కార్యాలయ సిబ్బందికి, ఫిబ్రవరి 1న జోన్-3 సిబ్బందికి, 2న జోన్-4, 3వ తేదీన జోన్-1, 2 జోనల్ కార్యాలయ సిబ్బందికి, చివరి రోజు ఫిబ్రవరి 4న జోన్-7, ప్రధాన కార్యాలయ సిబ్బందికి ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఈ పరీక్షలను జీవీఎంసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెక్షన్ సూపరింటెండెంట్ వి.లలితను 99482 95699 నంబరులో సంప్రదించాలన్నారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

పేదల వైద్యానికి 'ఆరోగ్యశ్రీ'తో భరోసా



మహిళకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న జాజుల రమేష్

అనకాపల్లి: మారుతున్న కాలానుగుణంగా వైద్య ఖర్చులు పెరుగుతున్నాయని, పేదలను దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. వేల్పులవీధి సీతా రామ కల్యాణ మండపంలో సోమవారం లబ్ధిదారులకు నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. 7వ సచివాలయం పరిధిలో 300 ఆరోగ్యశ్రీ కార్డులను అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకొస్తోందన్నారు. రాష్ట్రంలో పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం ఉగ్గిన అప్పారావు, పార్టీ నేతలు బొండా శంకరరావు, కొంకి శ్రీరామ్మూర్తి, ఒడిశెట్టి కనక మహాలక్ష్మి, ద్రాక్షారపు లలిత, సచివాలయ వెల్ఫేర్ మహాలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

'మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి'

అనకాపల్లి: జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ప్రొద్దుటూరు మున్సిపాలిటీ క్లాప్ డ్రైవర్ ఆంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నినదించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా బల్లా నాగభూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శిగా వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శులుగా రొబ్బి మల్లేశ్వరరావు, బల్లా శ్రీనివాసరావుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1630 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,740	4,910
మొదటి రకం	3,610	4,100
రెండో రకం	3,560	3,760
మూడోరకం	3,350	3,550

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	రాజా
గుంటూరు కారం	సత్యనారాయణ స్క్రీన్-1
హనుమాన్	సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ	షిర్డీసాయి
సైంధవ్	పర్తిసాయి
గుంటూరు కారం(రెండు షోలు)	
హనుమాన్	వెంకటేశ్వర
నా సామిరంగ	శ్రీసత్య
హనుమాన్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 51 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-35, ఏబీ పాజిటివ్-5, ఓ నెగిటివ్-2, ఏబీ నెగిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 247 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 182 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.



కష్టాలు కనుమరుగు

నాడు అధ్వానం

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అపరిశుభ్రంగా.. అధ్వానంగా ఉండేవి. వాటిని శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా ఎటువంటి వ్యవస్థ ఉండేది కాదు. చాలా పాఠశాలల్లో విద్యార్థులతోనే తరగతి గదులను శుభ్రం చేయించేవారు. కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే టాయిలెట్లు ఉండేవి. వాటిని కూడా కొందరు విద్యార్థులతో శుభ్రం చేయించేవారు. బాలికలకు టాయిలెట్లు లేకపోవడంతో ముళ్లపొదలు, చెట్ల చాటుకు **వెళ్లాల్సి వచ్చేది.**

నేడు కొత్తకళ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రభుత్వ బడుల్లో స్వచ్ఛత మెరుగైంది. ఎన్నడూ లేని విధంగా పాఠశాలలన్నీ శుభ్రంగా కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో చేపట్టిన విప్లవాత్మక చర్యలతో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు మెరుగయ్యాయి. ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణపై విద్యా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు నేడు **పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.**



సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- **ప్రతి పాఠశాలలో బాలబాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు**
- **మరుగుదొడ్ల శుభ్రతకు** ఆయాల నియామకం
- నదుపాయాల కల్పనపై విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం



బాలికల మోడ్రన్ టాయిలెట్లు



బాలుర మరుగుదొడ్లు



హైస్కూల్‌లో టాయిలెట్లు శుభ్రం చేస్తున్న ఆయా

అనకాపల్లి(యలమంచిలి రూరల్): అనకాపల్లి మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 107 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 9,964 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి సంఖ్యకు తగ్గట్టు అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉన్నాయి. వాటి శుభ్రతకు 116 మంది ఆయాలను నియమించారు. పాఠశాల పరిశుభ్రతతోపాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు 300 మంది విద్యార్థుల వరకు ఒకరు, 301 నుంచి 600 వరకు విద్యార్థులుంటే ఇద్దరు, 601 నుంచి 900 వరకు విద్యార్థులుంటే ముగ్గురు, 900 మందికి పైగా విద్యార్థులుంటే నలుగురు ఆయాల చొప్పున నియమించారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

రాష్ట్ర ప్రభుత్వం పిల్లలను బడికి పంపిస్తున్నందుకు అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేస్తోంది. ఇందులో కొంత నగదును తల్లిదండ్రుల అంగీకారంతో ప్రత్యేకంగా టాయిలెట్ ఫండ్ అని ఏర్పాటు చేశారు. దీని నుంచి ఒక్కో ఆయాకు రూ.6 వేలు వేతనంగా ఇస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి పాఠశాలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాలను నియమించారు. మరుగుదొడ్ల శుభ్రతకు అవసరమైన శానిటేషన్ పనిముట్లు, రసాయనాలను సైతం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.

హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్ల నియామకం..

గతంలో ఉన్నత పాఠశాలల్లో ఉండే విలువైన వస్తువులకు రక్షణ ఉండేది కాదు. నేడు మండలంలోని 16 హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్లను ప్రభుత్వం నియమించింది. దీంతో ప్రతి హైస్కూల్‌కు రాత్రి వేళల్లో రక్షణ ఉండేలా చర్యలు తీసుకుంది. విద్యా వ్యవస్థ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వాటి నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి పాఠశాలకు ఆయాలను నియమించి టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడమే కాకుండా వాటి నిర్వహణ సక్రమంగా ఉండేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా ఇస్తోంది. ఈ చర్యలతో ప్రభుత్వ బడులన్నీ శుభ్రంగా ఉంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు.

– చిట్టిబాబు, ఎంఈవో 1, అనకాపల్లి మండలం

టాయిలెట్లు బాగున్నాయి



చిన్ననాటి నుంచి ప్రభుత్వ స్కూల్‌లోనే చదువుకుంటున్నాను. గతంలో వాష్ రూమ్‌లు బాగుండేవి కావు. బయట మైదానాలకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం టాయిలెట్లు బాగున్నాయి. బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఉన్నాయి. ప్రతి రోజూ పలుమార్లు టాయిలెట్లను ఆయాలు శుభ్రపరుస్తున్నారు.

– బోయిన చంద్రిక, 10వ తరగతి, సీతానగరం జెడ్పీ హైస్కూల్

ప్రతి రోజూ శుభ్రం చేస్తున్నాం



మా స్కూల్‌లో బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మించారు. రెండు బ్లాకులను ప్రతి రోజూ శుభ్రపరుస్తున్నాం. క్లీనింగ్‌కు అవసరమైన శానిటేషన్ వస్తువులన్నీ ప్రభుత్వం సమకూర్చింది. బాత్ రూం బకెట్లు, జగ్గులు, క్లీనర్ ద్రావణం, స్ప్రే బాటిళ్లు, ఆయాలకు సేఫ్టీ జాకెట్లు, చేతులకు గ్లోవ్స్ అందుబాటులో ఉన్నాయి. దీని వల్ల టాయిలెట్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచగలుగుతున్నాం.

– రామలక్ష్మి ,ఆయా, సీతానగరం హైస్కూల్

తాళ్లపాలెం హైస్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో 75 మంది 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యార్థులు విద్యాభివృద్ధి సాధించడానికి ట్యాబ్‌లను అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద్, స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందలి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఈఈ రాజశేఖర్

అనకాపల్లి: గవరపాలెం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు వర్చువల్ విధానంలో జరిగింది. 10 మంది వినియోగదారులు తమ సమస్యలు ఆన్‌లైన్ ద్వారా విన్నవించుకున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 1982-83 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982–83 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం స్థానిక ప్రమీలా తోటలో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్నప్పటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. ఏటా సమావేశం కావాలని నిర్ణయించారు. తాము చదువుకున్న డీపీఎన్ పాఠశాలకు తమ బ్యాచ్ తరఫున సేవలందించాలని నిర్ణయించారు. చివరగా తమ కలయికకు గుర్తుగా అంతా ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకరరావు, పీర్ సాహెబ్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో సీఎం జగన్ ప్రత్యేక ముద్ర



పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

యలమంచిలి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పద్మనాభరాజుపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు గొన్నాబత్తుల శివ, పేట బయ్యవరం సర్పంచ్ మొగలిపల్లి సత్య నారాయణ అన్నారు. సోమవారం పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు 23 మందికి ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాముఖ్యతనిస్తుందని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనం మెనూలో కొత్త మార్పు లు తీసుకువచ్చి విద్యార్థులకు రుచికరమైన పోషకాహారాన్ని అందిస్తున్నారని, అలాగే ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా విద్యార్థులకు చక్కటి బోధన అందుతోందని తెలిపారు. ఎంపీటీసీ ఊటకూటి శేఖర్ మాట్లాడు తూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, ప్రతి పేదవాడి బిడ్డకు ఆంగ్ల విద్యను అందించాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.వరలక్ష్మి, బొడ్డేడ సత్యనారాయణ, కె.వీరభద్రరావు, పి.రవీంద్ర, బి.వి. ధనలక్ష్మి, ఎన్.శ్రీనుబాబు పాల్గొన్నారు.

నూకేశ్వరరావుకు భారత సేవారత్న పురస్కారం



శంకర్ నాయుడు నుంచి పురస్కారం అందుకుంటున్న నూకేశ్వరరావు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలేనికి చెందిన కేఎస్‌ఆర్ సేవా సమితి ఫౌండేషన్ అధ్యక్షుడు కలగా నూకేశ్వరరావుకు భారత సేవారత్న పురస్కారం లభించింది. తాసుబెల్లి ఫౌండేషన్ సిల్వర్ జూబ్లీ వారోత్సవాలను పురస్కరించుకుని విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నట్లు నూకేశ్వరరావు సోమవారం తెలిపారు. దేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలు స్వచ్ఛంద సంస్థలకు ఈ పురస్కారాలు ఇచ్చారని, ఏపీ తరఫున పలు స్వచ్ఛంద సంస్థలతోపాటు తమ సంస్థకు పురస్కారం లభించిందని చెప్పారు. ఈ పురస్కారం తమ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేసేందుకు ప్రోత్సాహాన్నందించిందన్నారు.

సమస్యలపై చర్చ.. పరిష్కారానికి సూచనలు

అర్థవంతంగా సాగిన మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

నబ్బువరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఫలప్రదంగా సాగింది. పలు సమస్యలపై చర్చించడంతో పాటు పలు శాఖల అధికారుల తీరును సభ్యులు ఎండగట్టారు.సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. మొత్తానికి సోమవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని ప్రజాప్రతినిదులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ సూర్యకుమారి స్పందిస్తూ ఇకపై పొరపాట్లు జరగకుండా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని.. సమగ్ర రీ సర్వేలో గుర్తించిన లోపాలను సరి చేయాలని సూచించారు.

సభ్యులు ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు

పైడివాడ అగ్రహారంలో విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేస్తున్నారని సర్పంచ్ వద్దాది అప్పలరాజు అసహనం వ్యక్తం చేశారు.

- సమగ్ర రీ సర్వేలో కమతాల విస్తీర్ణం తప్పుగా నమోదవడంతో పలువురు రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు కో ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు ప్రస్తావించారు. స్పందించిన తహసీల్దార్ సత్యనారాయణ వాటిని సరి చేస్తామని తెలియజేశారు.
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది పని తీరు బాగోలేదని ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆరోపించారు. నల్లరేగలపాలెంలో వృద్ధురాలు ఇటీవల మరణిస్తే ఆమెకు ఐదుగురు సంతానం కాగా అందులో కొంతమంది రిజిస్ట్రేషన్ పెట్టుకుంటే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదని నెల రోజుల పాటు పెండింగ్ పెట్టారన్నారు. తర్వాత అదే ఫైల్ లంచం తీసుకుని పూర్తి చేశారని ఆమె ఆరోపించారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో అలాంటిది జరగలేదని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.
- గ్రామాల్లో సీసీ రోడ్లు,డ్రైన్‌లు, బీటీ రోడ్లు వంటి వాటికి అవసరమైన మేరకు గ్రావెల్ తరలించానికి అధికారులు అనుమతులు ఇవ్వాలని పలువురు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి,ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో షేక్ బాబూరావు,ఈవోఆర్డీ మహేష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపిన 'పరీక్షా పే చర్చ'

ప్రధాని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు



కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్ : విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి సోమవారం ప్రధాని మోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని యలమంచిలి మండలం, పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పి)లను ఏర్పాటు చేయడంతో ప్రధాని ప్రసంగాన్ని విద్యార్థులంతా ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం ఏర్పడింది. ఢిల్లీ భారతీ మందిరంలో జరిగిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని సూచించిన పలు చిట్కాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పట్టణంలో కొత్తపేట, స్టేషన్ రోడ్డు జెడ్పీ హైస్కూళ్లు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల సహా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులంతా ప్రధాని ప్రసంగంలో అంశాలను చర్చించుకున్నారు. పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ప్రధాని వివరించిన తీరు విద్యార్థులను ఆకట్టుకుంది. ఆట స్థలానికి వెళ్లిన వారిలో కొందరే విజేతలుగా తిరిగి వస్తారు. ఎక్కువ మంది ఓటమి చెందుతారు. ప్రతి ఓటమి ఒక కొత్త పాఠాన్ని నేర్పుతుందని, ఇతరులపై కన్నా మీపైనే మీరు దృష్టి పెట్టడం, మీతో మీరే పోటీ పడడం వంటి ప్రధాని మాటలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. పలు చోట్ల ఉపాధ్యాయులు ప్రధాని మోదీ ప్రసంగాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. స్మార్ట్ ఫోన్‌ను అవసరం మేరకే వినియోగించాలని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని విద్యార్థులు పాటించాలని కొత్తపేట హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు సుసర్ల సూర్య ప్రకాష్ (జిల్లా రిసోర్స్ పర్సన్) వివరించారు.

చూచుకొండలో నేడు వైఎస్సార్ తీర్థం



చూచుకొండలో రాజన్న విగ్రహం

మునగపాక : చూచుకొండలో మంగళవారం వైఎస్సార్ తీర్థం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మహానేత రాజన్న విగ్రహానికి పార్టీ నేతలు ఉదయం నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రజలు వైఎస్సార్ తీర్థ మహోత్సవానికి తరలిరావాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం


యలమంచిలి రూరల్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కొఠారు దుర్గారావు, ఆచళ్ల వీర, గొల్లవిల్లి చిన్నాజీ తెలిపారు. ఈ శిబిరాన్ని పూర్వ విద్యార్థులు, యువకులు విజయవంతం చేయాలని వారు కోరారు.

మదర్ బ్లడ్ కేంద్రం ఆధ్వర్యంలో శిబిరం కొనసాగుతుందని చెప్పారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమని అవకాశం ఉన్న యువకులంతా రక్తదానానికి ముందుకు రావాలని వారు కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభాల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రావాడ పంచాయతీలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఫలితంగా రావాడ, రేఖవానిపాలెం, గొల్లగుంట, కొత్త వెన్నలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఈఈ రామకృష్ణ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


జల్‌జీవన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందుతుందన్నా రు. పథకం నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ దుర్గాప్రసాద్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాపు జేఏసీ కన్వీనర్‌గా నాగేశ్వరరావు



రాంబిల్లి: కాపు జేఏసీ యలమంచిలి నియోజకవర్గ కన్వీనర్‌గా గోకివాడకు చెందిన ద్వారపురెడ్డి నాగేశ్వరరావు నియమితులు కావడంతో ఆయనను పలువురు అభినందించారు. కాపుల ఐక్యతకు, సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాపులు రాజకీయంగా , ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఆయన కోరారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాంబిల్లి: వాడనర్సాపురం గ్రామ పరిధిలో పేకాటశిబిరంపై దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఈ గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్నట్టు తమకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అలాగే రూ.1380 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.